నేడు కట్టమైసమ్మ బోనాలు





చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ బోనాల జాతర వేడుకలకు సర్వం సిద్ధమైంది. పుష్పాలు, విద్యుత్‌దీపాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టారు. సుమారు లక్ష మంది భక్తులు వేడుకల్లో పాల్గొంటారని అంచనా. కాసుగుల వంశీయులు శనివారం సమర్పించిన మైలబోనంతో జాతర సందడి మొదలైంది. బోనంతో వచ్చేవారికి, మహిళలకు ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు చేశామని ఆలయ ఈఓ మహేందర్‌గౌడ్, ట్రస్టీబోర్డు చైర్మన్ గుంటి కృష్ణలు తెలిపారు. ఆదివారం బోనాలు, ఫలహారంబళ్లు, తొట్టెల ఊరేగింపు, సోమవారం భవిష్యవాణి వినిపించే రంగం కార్యక్రమం జరుగుతుంది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు అమ్మవారిని దర్శించుకుంటారు.

బోనాల ఏర్పాట్లను పరిశీలించిన దేవాదాయ కమిషనర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవదాయశాఖ కమిషనర్

చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ బోనాల జాతర ఏర్పాట్లను దేవదాయశాఖ కమిషనర్ హనుమంతరావు శనివారం పరిశీలించారు. బోనంతో వచ్చే మహిళలు, భక్తులకు ఏర్పాట్లు చేసిన క్యూలైన్లు, అలంకరణలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఓ మహేందర్‌గౌడ్, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కృష్ణ, పలు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

మరమ్మతు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: ఆలయాల వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఆదేశించారు. బోనాల పండుగ నేపథ్యంలో డివిజన్ పరిధిలోని పలు ఆలయాల వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్న మాట్లాడుతూ ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రెండో డాక్టరేట్ అందుకున్న డా. మౌలాలి దాసరి



లాలాపేట: గురుకుల టీచర్ డా. మౌలాలి దాసరి ఉస్మానియా యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ సోషల్ వర్క్స్‌లో పీహెచ్‌డీ డాక్టరేట్‌ను అందుకున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా బల్మూర్ మండల పరిధిలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన కొండనాగుల గ్రామానికి చెందిన దాసరి మౌలాలీ ఇదే ఉస్మానియా యూనివర్సిటీ హిందీ డిపార్టుమెంట్ నుంచి 2016 లో ప్రొఫెసర్ అవినాష్ జైస్వాల్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్‌ను అందుకున్నారు. కాగా తాజాగా సోషల్ వర్క్స్ విభాగం నుంచి ప్రొఫెసర్ కనకదుర్గాంబ(రూడా మేస్త్రీ కాలేజ్) పర్యవేక్షణలో ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీస్, ఇంట్రడక్షన్, ఇంటర్ పెస్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఏ డిస్ట్రిక్ స్టడీ ఆఫ్ ఎట్ నాగర్‌కర్నూల్, తెలంగాణ' అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను మౌలాలికి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పద్మారావునగర్: పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ప్రపంచ పకృతి పర్యావరణ రక్షణ దినోత్సవం సందర్భంగా శనివారం బోలక్‌పూర్‌లోని శ్రీ క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పర్యావరణంపై విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ పరిరక్షణ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి తమ జన్మదినం రోజు తప్పనిసరిగా ఓ మొక్క నాటాలని ప్రతిజ్ఞప్తి చేయించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి పాల్గొన్నారు.

గౌరీ శంకర్ స్మారక ఉపన్యాసం

లాలాపేట: విద్యార్థి సేవా సమితి, అఖిల భారత విద్యార్థి పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తార్నాకలోని ఎన్ఐఎన్ ఆడిటోరియంలో జనమంచి గౌరీ శంకర్ 18వ స్మారక ఉపన్యాసం కార్యక్రమం జరిగింది. దీనికి సుప్రీం కోర్టు సీనియర్ అడ్వకేట్ మోనికా అరోరా ముఖ్యతిథిగా హాజరై ప్రసంగించారు. గౌరీ శంకర్ సేవలను కొనియాడారు కార్యక్రమంలో ఐఆర్ఏ రియాలిటీ మెనేజింగ్ డైరెక్టర్ పోషం నర్సిరెడ్డి, ఏబీవీపీ నేతలు పాల్గొన్నారు.

బోనాలకు పకడ్బందీ ఏర్పాట్లు

బౌద్ధనగర్: బోనాల పండుగ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి తెలిపారు. చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 58 దేవాలయల వద్ద భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా చిలకలగూడలోని కట్ట మైసమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆలయ నిర్వాహకులకు సూచించినట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని విధాలుగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ఆదివారం, సోమవారం కలిపి మొత్తం 32 ఫలహార బండ్ల ఊరేగింపులు జరుగనున్నట్లు ఏసీపీ జైపాల్‌రెడ్డి తెలిపారు. ఊరేగింపులో డీజేలకు ఎట్టిపరిస్థితుల్లో అనుమతి లేదని తేల్చి చెప్పారు.

ఇద్దరు మహిళా దొంగల అరెస్టు

రాంగోపాల్‌పేట్: ఉత్సవాలు, ఊరేగింపులు రద్దీగా ఉండే ప్రదేశాల్లో మహిళలే లక్ష్యంగా మొబైల్ ఫోన్లు, పర్సులు దొంగతనాలు చేస్తున్న ఇద్దరు మహిళా దొంగలను ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ మహంకాళి పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపిన మేరకు.. బోరబండకు చెందిన ఉర్సు నర్సింహ భార్య, ఉర్సు సోని (26), ఫతేనగర్‌కు చెందిన గణేష్‌కుమార్ భార్య వేమ్ల శిరీష(24)లు ఇద్దరు స్నేహితులు. రద్దీగా ఉండే ప్రాంతాలకు వెళ్లి మహిళల వద్ద ఉండే మొబైల్ ఫోన్లు, విలువైన వస్తువులు, పర్సులు దొంగిలిస్తూ ఉంటారు. ఇలా ఇటీవల జరిగిన మహంకాళి బోనాల జాతరలో వీరు తమ చేతివాటాన్ని ప్రదర్శించి మొబైల్ ఫోన్లు కొట్టేశారు. అలాగే సనత్‌నగర్, ఎస్ఆర్‌నగర్, గోపాలపురం పోలీస్ స్టేషన్ల పరిధుల్లో కూడా ఇలాగే దొంగతనాలు చేసి తప్పించుకుని తిరుగుతున్నారు. ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్, మహంకాళి పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిందితులు సోని, శిరీషలుగా గుర్తించి శనివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి ఆరు మొబైల్ ఫోన్లు, వన్‌ప్లస్ చార్జర్, ఇయర్ ప్యాడ్స్ స్వాధీనం చేసుకున్నారు. మహంకాళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉత్సాహంగా సౌత్ ఇండియా ఎలైట్ బ్రాండ్ అవార్డుల ప్రదానం



సౌత్ ఇండియా ఎలైట్ బ్రాండ్ అవార్డుల ప్రదానోత్సవంలో మాధవీలత తదితరులు

సనత్‌నగర్: వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తోన్న పలువురికి గ్లోబల్ పినాకిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా ఎలైట్ బ్రాండ్ అవార్డులను ప్రదానం చేశారు. బేగంపేటలోని కంట్రీక్లబ్‌లో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీజేపీ నేత, సామాజిక కార్యకర్త మాధవీలత కొంపెల్ల ముఖ్యఅతిథిగా హాజరై సేవాతత్పరులను పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవలు చేసే వారికి అవార్డులు, సత్కారాలు వారిని మరింత ప్రోత్సహిస్తాయన్నారు. ఫౌండేషన్ నిర్వాహకులు రిషిత రుమాల, సచికేత్ రుమాల తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వైద్యవిధానాలపై అవగాహన పెంచుకోవాలి

రాంగోపాల్‌పేట్: ఆధునిక వైద్య విధానాలపై వైద్యులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు అన్నారు. కిమ్స్ ఆస్పత్రిలో జరుగుతున్న సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోగి ఏ వ్యాధితో బాధపడుతున్నాడో అనేది తెలుసుకోవడంలో రేడియాలజీ విభాగం పని చాలా కీలకమని అన్నారు. వారి నిర్ధారణను బట్టి వైద్యులు సరైన వైద్యం అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కే ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ సికిందర్ షేక్, కిమ్స్ ఆస్పత్రి రేడియాలజీ విభాగం వైద్యులు డాక్టర్ అంబర్ పాపాల్కర్, డాక్టర్ అనంతరామ్‌లు పాల్గొన్నారు.

కనులపండువగా భూలక్ష్మి అమ్మవారి ఘటం ఊరేగింపు



బేగంపేట ప్రకాష్‌నగర్
శ్రీభూలక్ష్మీ అమ్మవారి ఘటం ఊరేగింపు..

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని శ్రీరామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీభూలక్ష్మీ అమ్మవారి ఘటం ఊరేగింపు కనులపండువగా జరిగింది. ఆలయ ధర్మకర్త విశాల్ సూదం ఆధ్వర్యంలో ఈ ఏడాది తొలిసారిగా ఘటం ఊరేగింపు సంప్రదాయానికి నాంది పలకగా ప్రకాష్‌నగర్‌లోని వీధివీధినా ఘటాన్ని ఊరేగించారు. అమ్మవారి ఘటానికి భక్తులు అపూర్వ స్వాగతం పలికారు. మధ్యాహ్నం ప్రారంభమైన ఊరేగింపు అన్ని వీధుల్లో కొనసాగి రాత్రికి అమ్మవారి ఆలయ సన్నిధికి చేరుకుంది.

ఆలయ కమిటీ సభ్యులకు పలువురి అభినందన



ఆలయ కమిటీ ప్రతినిధులను అభినందిస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి ప్రతినిధులకు శనివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ నూతన చైర్మన్ డి.చందర్‌తోపాటు ధర్మకర్తలను లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ నేతృత్వంలో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆదం సంతోష్‌కుమార్, జలంధర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, జిల్లా సాధన సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

టైప్ రైటింగ్ పరీక్షలకు ఆరు వేల మంది హాజరు



టైప్ పరీక్షకు హాజరైన విద్యార్థులు

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు రోజుల పాటు జరిగిన టైపు రైటింగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలంగాణ టైప్ రైటింగ్ షార్ట్ హ్యాండ్, కంప్యూటర్ ఇన్స్టిట్యూట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ మసూద్ అలీ తెలిపారు. మారేడుపల్లి మండల పరిధిలోని టైప్ రైటింగ్ పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఈ పరీక్షలకు దాదాపు 6 వేల మంది అభ్యర్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసిన స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ పుల్లయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మొక్కలను నాటి పరిరక్షించాలి

రసూల్‌పురా: కంటోన్మెంట్ తిరుమలగిరి మండల పరిధిలో పురావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సహకారంతో బొల్లారం త్రిశూల్ పార్క్, మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇందిరా వనప్రభు కార్యక్రమంలో భాగంగా శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో డీసీపీ మధుకర్ స్వామి, కంటోన్మెంట్ బోర్డు శానిటేషన్ సూపరిటెండెంట్ ఆకుల మహేందర్ ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కల నాటడంతో పాటు వాటిని పరిరక్షించాలన్నారు. బోర్డు శానిటరీ ఇన్స్‌పెక్టర్ అమిత్, తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు గూడూరి షడ్రక్ పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.31, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 19, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 21, దోసకాయ 15, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 34, ఆలుగడ్డ 41, చామగడ్డ 40, మొరంగడ్డ 40, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

కారిడార్ల ఆధునీకరణ పనులు వేగవంతం చేయాలి



జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జడ్‌సీ రవికిరణ్

సికింద్రాబాద్: జీహెచ్ఎంసీ జోనల్ పరిధిలోని ప్రధానహదారుల్లోని కారిడార్లను ఆధునీకరించే పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్ సూచించారు. శనివారం సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ఐదు సర్కిళ్లకు చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఇంజినీర్లు, డిప్యూటీ కమిషనర్లతో జోనల్ కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లై ఓవర్లకు పెయింటింగ్, విద్యుత్ దీపాల ఏర్పాటు, ఫౌంటెయిన్ల పునరుద్ధరణ పనుల గురించి చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సుభాష్‌రావు, సమ్మయ్య, ఖాదర్, మారుతీ దివాకర్, రాజు, రాజ్‌కుమార్, సంతోష్ తదితర ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో ఇటీవల శివరాత్రి అప్పారావు ఇటీవల మృతి చెందారు. దీంతో శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ నాయకులు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

ముస్తాబైన ఆలయాలు

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ వ్యాప్తంగా ఆదివారం బోనాల వేడుకలు జరుగనున్నాయి. తార్నాక, మాణికేశ్వర్‌నగర్, లాలాపేట, శాంతినగర్ తదితర ప్రాంతాల్లోని గ్రామదేవతల ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు.బోనం సమర్పించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో జేసీఐ పుస్తకాల పంపిణీ



బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో జేసీఐ సికింద్రాబాద్ ప్రతినిధులు పేద పిల్లలకు పుస్తకాలను అందజేశారు. పాఠశాలలోని 3, 4, 5 తరగతులకు సంబంధించి విద్యార్థులకు కావాలసిన పుస్తకాలున జేసీఐ సికింద్రాబాద్ ప్రతినిధులు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో జేసీఐ సికింద్రాబాద్ అధ్యక్షులు సుధన్య, ప్రధాన కార్యదర్శి డి. వరుణ్, కోశాధికారి బి. కార్తీక్, గోపిక్రిష్ణ, జూనియర్ జేసీఐ చైర్‌పర్సన్ వరుణి, ప్రధాన కార్యదర్శి కుమారి తరుణి పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం



ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులతో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి

రసూల్‌పురా: క్రీడాకారుడు, క్రీడాభిమాని ముఖ్యమంత్రి కావడం తెలంగాణ రాష్ట్రంలో క్రీడలకు శుభ పరిణామమని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే. శివసేనారెడ్డి అన్నారు. శనివారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో మాస్టర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను శివసేనా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో క్రీడల నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అన్ని క్రీడాంశాల్లో అన్ని విభాగాల్లో నిరంతరం క్రీడా పోటీలు నిర్వహించే దిశగా క్రీడా సంఘాలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు వై. రామారావు, ఉపాధ్యక్షుడు శర్మ పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఏసీపీ గోపాలకృష్ణమూర్తి

సనత్‌నగర్: బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. శనివారం బేగంపేటలోని ఏసీపీ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ రామయ్యతో కలిసి బోనాల ఉత్సవ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల వద్ద పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారని, పోలీసులతో పాటు నిర్వాహకులు కూడా పరిశీలిస్తూ ఉండాలని చెప్పారు. అనుమానిత వ్యక్తుల కదలికలు ఉండే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.